ప్రధాని సమయమిస్తే ఢిల్లీకి వస్తాం

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి
- 9వ షెడ్యూల్‌లో చేర్చేలా రాజ్యాంగ సవరణ జరగాలి
- పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చకు తేవాలి
- రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కృషి చేయాలి : భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమయమిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బిసిలకు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. తొమ్మిదో షెడ్యూల్ చేర్చేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని చెప్పారు. తెలంగాణకు చెందిన ఎంపీలు పార్లమెంటు సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చకు తేవాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఎంపిల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎంపిల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బిసిల రిజర్వేషన్ అంశంపై పార్లమెంటు సమావేశాల్లో నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం లేదంటే ప్రశ్నోత్తరాల్లో చర్చకు తేవాలని కోరారు. ప్రధానమంత్రిని కలిసి అన్ని పార్టీల ఎంపీలూ వినతి పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. బిసిల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందనీ, ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బిసిల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని చెప్పారు. ఆ బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్‌లో ఉందని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా ఎంపీలందరూ పార్టీలకతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని అన్నారు. ఎంపీలు అడిగిన సమాచారం నిమిషాల్లో లేదా గంటల్లో అందించేందుకు ఢిల్లీలో ప్రణాళిక ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామనీ, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జిఎస్‌టి తదితర విషయాలకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాలకు గురించి గతంలో లేఖలు రాశామని గుర్తు చేశారు. అవి ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపీలకు అందుబాటులో ఉంటాయనీ, వాటి ఆధారంగా ఎంపిలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి విజన్ డాక్యుమెంట్

వచ్చేనెల తొమ్మిదో తేదీ నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి విజన్ డాక్యుమెంట్-2047 ఆవిష్కరించబోతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖులను దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనకు అవసరమైన వనరులు, ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నామనీ, కేంద్ర మంత్రులు, ఎంపీలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న ఎంపీలు పేర్లు ఇస్తే కమిటీల సభ్యులుగా నమోదు చేస్తామన్నారు. ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపీలు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇస్తే వారిని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామని చెప్పారు. కేంద్రానికి సంబంధించిన 12 శాఖల ద్వారా 47 అంశాలను గుర్తించామని అన్నారు. సెమీ కండక్టర్లకు సంబంధించిన అంశం కూడా చర్చించామన్నారు.

ప్రధానిని సమిష్టిగా కలుద్దాం : ఎంపి రఘునందన్‌రావు

రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్‌లు, ఇతర సమస్యలపై ప్రధానమంత్రి మోడీ సమయం తీసుకుని సమిష్టిగా కలుద్దామని మెదక్ ఎంపి రఘునందన్‌రావు చెప్పారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఎఎస్, ఐపిఎస్ క్యాడర్ కేటాయింపు గురించి పూర్తి సమాచారాన్ని ఇస్తే సంబంధిత మంత్రిని పార్టీలకతీతంగా కలసి లేఖ ఇద్దామని ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్దామని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన బొగ్గు గనుల విషయంలో అందరం కలిసి ఆ శాఖ మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టంలో పని దినాలు బాగా తగ్గుతున్నాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ చెప్పారు. దీంతో పేదలకు ఉపాధి లేకుండా పోవడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, బిజెపి ఎంపి నగేశ్, సిఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఒకరిపై ఒకరం పోటీ చేయొద్దు

- సిపిఐ, సిపిఎం మధ్య పరస్పర అవగాహన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఒకరిపై ఒకరు పోటీ చేయకుండా ఉండాలని సిపిఐ, సిపిఎం పరస్పర అవగాహన కుదుర్చుకున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆ రెండు పార్టీల ముఖ్య నేతల సమావేశం జరిగింది. అందులో రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి నాగయ్య, సిపిఐ జాతీయ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఇటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వీఎస్.బోస్ పాల్గొన్నారు. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లో ఒకరిపైఒకరుపోటీచేయొద్దనిఇరుపార్టీల నేతలు నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యకు గురై నెలరోజులు కావస్తున్న పోలీసులు హంతకులను పట్టుకోలేదని, కేసు విషయంలో ఎలాంటి పురోగతి లేదనీ, వెంటనే ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి

హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు పూర్తి సహకారం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రతియేటా ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్‌లో జరిగే ఈ పుస్తక మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం మంత్రి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పూర్వకాలపు సాహితీవేత్తలు రచించిన సమాజ హిత పుస్తకాలను సేకరించాలని బుక్‌ఫెయిర్ నిర్వాహకులకు మంత్రి జూపల్లి సూచించారు. వీటిని ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ. కోటి వెచ్చించి ఆతరహా పుస్తకాలను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆనాటి మహానుభావులు రచించిన అటువంటి పుస్తకాలను ప్రతి గ్రామంలో గ్రామపంచాయతీలో మహిళా పంచాయతీల్లో గిరిజన ప్రాంతాల్లో ఈ పుస్తకాలను అందుబాటు ఉంచేలా ప్రయత్నం చేయాలని అన్నారు. ఈతరహా ముఖ్యమైన ముఖ్యమైన పుస్తకాలను సేకరించే పనిలో బుక్‌ఫెయిర్ నిర్వాహకులు నిమగ్నమవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

నూతన రచయితలకు ప్రత్యేకస్టాళ్లు:నిర్వాహకులు

రాష్ట్రంలోని ప్రముఖ సాహితీవేత్తలు, నూతన రచయితలను ప్రోత్సహించేందుకు ప్రదర్శనలో వారికి ప్రత్యేక స్టాళ్లను ఉచితంగా కేటాయించాలని నిర్వాహక కమిటీ నిర్ణయించింది. ఈసారి గత సంవత్సరం కంటే అదనంగా స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రచురణకర్తలు పాల్గొంటారని తెలియజేసింది.ఈ ఏడాది బుక్‌ఫెయిర్‌ను ఇందిరాపార్క్ దగ్గర ఉన్న ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్ వాసు, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, శ్రీనివాస్, దినకర్, జర్నలిస్ట్ ఆజమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభ ఆదిలాబాద్ జిల్లాలో రెండ్రోజులపాటు విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా కె సునీత, ప్రధాన కార్యదర్శిగా పి జయలక్ష్మి, కోశాధికారిగా పి.మంగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం పద్మశ్రీ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇ వెంకటమ్మ, బి స్వప్న, ఇ ఏమెలమ్మ, ఎ రజిత, ఆర్ త్రివేణి, జి జ్యోతి, డి సునీత, కె సమ్మక్క, ఎస్ బాబాయి ఎన్నికయ్యారు. రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా బి లలిత, జి పద్మ, పి రమ్య, పి స్వర్ణ, ఎం పద్మ, జి శారద, జి కవిత, పి నాగమణి, టి పార్వతి, బి శోభ, ఇద్దరు కో ఆప్షన్, ఆఫీస్ బేరర్స్‌గా 27 మంది ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ మొత్తం 50 మందితో ఎన్నికైందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.



నిరంతర అన్వేషి అందెశ్రీ

- ప్రముఖ సంపాదకుడు కె శ్రీనివాస్

ప్రజాశక్తి కల్చరల్

మనిషిలో తపన సమాజానకి ఏదో మంచి చేయాలన్న ఆలోచనలతో అందెశ్రీ నిరంతర అన్వేషించారని ప్రముఖ సంపాదకుడు కె శ్రీనివాస్ అన్నారు. జాతీయ సంగీత కళా కారుల సంఘం నిర్వాహణలో రవీంద్ర భారతి సమావేశ మందిరంలో అందెశ్రీ సంస్మరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ అందెశ్రీ మృతి తరువాత ప్రభుత్వం నివాళి కార్యక్రమ చేసినా ఆయన మరణం తరువాత స్పందన అంతగా రాలేదు అని అభిప్రాయం వ్యక్తం చేశారు ఆ లోటు ఈ సభ కొంత తీరుతుంది అన్నారు అందెశ్రీ ఏ వాదానికి కట్టుబడి లేరని, అందువల్ల సభలు అంతగా జరుగలేదని అన్నారు. జయ జయ తెలంగాణ రాష్ట్ర గీతంగా గత ప్రభుత్వం గుర్తుంచలేదని, ప్రస్తుత ప్రభుత్వం గుర్తించిందని, అంతకు ముందు ప్రజలే గుర్తించి ప్రతి చోట పాడుకున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి పాట నాయకత్వం వహించిందని అన్నారు. వేదికపై తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకరం సినీ కవి మౌన్యశ్రీ మల్లిక్ తదితరులు పాల్గొనగా సంఘం అధ్యక్షుడు చిన్న రావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్ర పటం కాలెండర్ ఆవిష్కరించారు.

శాస్త్రీయ సంగీత స్వర సామ్రాజ్ఞి ఎంఎస్ సుబ్బులక్ష్మి

ప్రజాశక్తి కల్చరల్ : శాస్త్రీయ సంగీతంలో చిన్ననాటి నుండి అవిశ్రాంత సాధన చేసి ఉన్నత శిఖరం అధిరోహించిన స్వర సామ్రాజ్ఞి ఎంఎస్ సుబ్బులక్ష్మి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా కర్ణాటక సంగీత విదుషీమణి సుబ్బులక్ష్మి జయంతి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ గాంధీజీ మెచ్చిన గాయని సుబ్బు లక్ష్మి అని అన్నారు. ఆమె పాడిన శంకరాచార్య విరచిత భజ గోవిందం స్తోత్రాలు పండిత పామరులను సైతం రంజిపజేస్తూ జీవిత పరమార్థం అవగతం చేస్తాయని వివరించారు. శాస్త్రీయ సంగీతంలో దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న అందుకున్నారని గుర్తు చేశారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి మాట్లాడుతూ సుబ్బు లక్ష్మిని గాన సభకు వచ్చే ప్రేక్షకులు సదా స్మరించేలా ఆమె పెద్ద చిత్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వేదికపై సాహితీ వేత్త డాక్టర్ జయ రాములు కళాభిమాని వెంకటరావు సంఘ సేవకుడు డాక్టర్ పిఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల ప్రిలిమినరీ ఆన్సర్ కీ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రస్థాయిలో 8వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల) స్కీం ఎగ్జామినేషన్ ప్రిలిమినరీ కీ విడుదల చేసినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు పివి శ్రీహరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కీపై అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ 6వ తేదీలోపు dirgovexams.tg@gmail.com లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. గడువు ముగిశాక అభ్యంతరాలు ఎట్టి పరిస్థితిలో స్వీకరించబోమని స్పష్టం చేశారు.

అమ్మకాల్లో 15 శాతం వృద్ధి లక్ష్యం : కెవైౖ 2 జినాక్స్

హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో ఈ ఏడాది అమ్మకాల్లో 15 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామని కెవైౖ 2 జినాక్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్ పేర్కొన్నారు. టిఎంటి బార్ల తయారీదారు అయినా తమ సంస్థ తెలుగు రాష్ట్రాలలో తమ విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేస్తోన్నామని సునీల్ తెలిపారు.ఉక్కు ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి, కంపెనీ ఒక సంవత్సరంలోగా తన టిఎంటి బార్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా 15 శాతం పెంచాలని నిర్దేశించుకుందన్నారు.

నిజామాబాద్‌లో ఇసుజు మోటార్స్ సర్వీసు సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : నిజామాబాద్‌లో తన కొత్త అధీకృత సర్వీస్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఇసుజు మోటార్స్ ఇండియా వెల్లడించింది. దీనిని ఆరు ఎస్ ఆటోమొబైల్స్ ఇండియా నిర్వహించనుందని పేర్కొంది. తద్వారా వినియోగదారులు ఆ ప్రాంతములో సేవలను పొందడం సులభం కానుందని ఇసుజు మోటార్స్ ఇండియా డిప్యూటీ ఎండి తోరు కిసిమోటో తెలిపారు. ఇసుజు మోటార్స్‌తో చేతులు కలపడం తమకెంత గర్వకారణంగా ఉందని 6ఎస్ ఆటోమొబైల్స్ డీలర్ ప్రిన్సిపల్ శ్రీకర్ కోయల పేర్కొన్నారు.

ఆర్‌ఎస్ బ్రదర్స్ 16వ షోరూం గచ్చిబౌలిలో ఏర్పాటు



హైదరాబాద్ : కుటుంబ షాపింగ్ గమ్యస్థానాలలో ఒకటిగా పేరొందిన ఆర్‌ఎస్ బ్రదర్స్ తన 16వ షోరూంను గచ్చిబౌలిలో ఏర్పాటు చేసింది. గురువారం దీనిని లాంచనంగా ప్రారంభించింది. ఇది తమ సంస్థకు మరో మైలురాయి అని ఆ సంస్థ పేర్కొంది. దీని ప్రారంభోత్సవానికి నటి మీనాక్షి చౌదరి ప్రత్యేక అతిథిగా హాజరై తన సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం అభిమానులను అలరించారు. అన్ని వయసుల వారికీ అత్యుత్తమ శ్రేణి సాంప్రదాయ, ఆధునిక దుస్తులను అందించాలనే తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆ సంస్థ ఛైర్మన్, హోల్ టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ప్రత్యేకమైన కలెక్షన్ భారతదేశం నలుమూలల నుండి సేకరించబడిందని ఎండి సీర్న రాజమౌళి తెలిపారు. ఇక్కడ నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు లభిస్తాయని మరో హోల్‌టైం డైరెక్టర్ తిరువీధుల ప్రసాద రావు పేర్కొన్నారు.

జంతువుల రక్షణకు మానవతావాదిగా కట్టుబడి ఉన్నా

- ఫైలట్ ప్రాజెక్టుగా వేములవాడలో గోశాల: మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవతావాదిగా జంతువుల రక్షణకు కట్టుబడి ఉన్నాననీ, పశువుల రక్షణ బాధ్యత మానవాళి ఆర్థికాభివృద్ధికి చేయూత అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ఫైలట్ ప్రాజెక్టులో భాగంగా వేములవాడలో గోశాల ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన విపత్తుల సమయాల్లో జంతువులకు జరిగే ప్రమాదాల నివారణపై సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే జంతువులు పసిగడతాయని తెలిపారు. విపత్తుల వల్ల మూగజీవాలకు జరిగే నష్టాన్ని నివారించడానికి మంత్రిగా కాకుండా మానవత్వంతో పని చేస్తానని హామీనిచ్చారు. తెలంగాణలో గో సంరక్షణ పేరుతో ప్రభుత్వ పాలసీ తీసుకొచ్చామన్నారు. గోశాల నిర్వహణ విధివిధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. గ్లోబల్‌వార్మింగ్, యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మానవజాతితో పాటు జంతువులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని వివరించారు. తెలంగాణ వరదలకు, కరువు కాటకాలకు గురయ్యే ప్రాంతమని, ఆ సమయాల్లో జంతువులు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. 2024లో సంభవించిన వరదల వల్ల ఎన్నో పశుపక్షాదులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్కర సమయాల్లో జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని నొక్కి చెప్పారు. రాష్ట్రంలో పశు వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. మొబైల్ వెటర్నరీ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. జంతువుల రక్షణ కోసం పనిచేస్తున్న అన్ని ఎన్‌జీవో సంస్థలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో 26 లక్షల కుటుంబాలు పశు సంపద, పౌల్ట్రీ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంత సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవితంలో పశు సంపద కీలక పాత్ర అని చెప్పారు. సదస్సు నిర్వహించిన హ్యూమన్ ఫర్ యానిమల్స్ ఇండియా, యునిసెఫ్ ఇండియా సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ గోపాల్, డాక్టర్ శేఖర్, పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై అసత్య ప్రచారం

- కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకే పరిశ్రమల తరలింపు
- విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవినీతి లేదు : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలు చేస్తున్నాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఆ వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకే పరిశ్రమలను తరలిస్తున్నట్టు తెలిపారు. దీంట్లో అవినీతికి తావు లేకపోగా రాబడికి అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. విద్యుత్ కేంద్రాల నిర్మాణంలోనూ ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వం తెచ్చిన ఇండస్ట్రియల్ పాలసీలో కుంభకోణానికి ఆస్కారం లేదనీ, అత్యంత పారదర్శకమైన పాలసీ అని మంత్రి ఉత్తమ్ చెప్పారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాలసీని పూర్తిగా అర్థం చేసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలతో తమకు పెరుగుతున్న ఆదరణ తట్టుకోలేక ఉద్దేశపూర్వకంగా బురదజల్లుతున్నారని విమర్శించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఒఆర్‌ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ పాతదే అని గుర్తుచేశారు. గతంలోనూ ఈ పాలసీ ఉందనీ, బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనూ చర్చ జరిగిందని గుర్తుచేశారు. మళ్లీ బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని, పాలసీని మార్చేది లేదని ఎద్దేవా చేశారు.

విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో రూ.50 వేల కోట్ల కుంభకోణం జరిగిందని బిఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కొట్టిపారేశారు. రూ.50 వేల రూపాయల కుంభకోణం కూడా జరగలేదని అన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం అని విమర్శించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని పరికరాలు కొనుగోలు చేసిందని తెలిపారు. ఆ సబ్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో సదరు కేంద్రాన్ని నిర్మించారని చెప్పారు. ఆ కేంద్రం ఎందుకు ఉపయోగించలేని పరిస్థితి ఉందని వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం విద్యుత్ ప్రాజెక్టుకు కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని ఆయన దుయ్యబట్టారు.

సర్పంచ్ ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్లు తగ్గలేదు

- సుప్రీం మార్గదర్శకాల మేరకే ఖరారు
- పార్టీ పరంగా బిసిలకు 42 శాతం సీట్లు కేటాయిస్తాం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్లు ఎక్కడా తగ్గలేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సర్పంచ్‌ల రిజర్వేషన్లకు మండల యూనిట్‌గా, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు గ్రామపంచాయతీ యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని ఖరారు చేశామని పేర్కొన్నారు. సుప్రీం మార్గదర్శకాలననుసరించి 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. కొన్ని మండలాల్లో ఎస్‌సి, ఎస్‌టి జనాభా అధికంగా ఉండటంతో ఆ పరిమితిని దాటి పోకుండా ఉండేందుకు బిసి రిజర్వేషన్లలో కొంత మార్పు జరిగినట్టు చెప్పారు. సర్పంచుల రిజర్వేషన్లకు మండలాన్ని, వార్డు సభ్యులకు గ్రామాన్ని, జడ్‌పిటిసిలకు జిల్లాను, జడ్‌పి చైర్మన్లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకున్నామని వివరించారు. భద్రాచలం, ములుగు, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన 100 శాతం గిరిజనులకు రిజర్వేషన్ల కేటాయింపు జరిగిందనీ, ఇది రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆమె స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పడిన తండాలు, గూడేలు గ్రామపంచాయతీలుగా మారడంతో గిరిజన సీట్ల సంఖ్య సహజంగా పెరిగిందని తెలిపారు.

కెటిఆర్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

సర్పంచ్ ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల కేటాయింపుపై కెటిఆర్ తప్పుడు ప్రచారం మానుకోవాలని సీతక్క హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్లు తగ్గించిన పాపం బిఆర్‌ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, అయితే 2019లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించి బిసిల గొంతు కోసిందని ఆరోపించారు. వాస్తవాలు ఇలా ఉంటే బిసి రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 17 శాతానికి తగ్గించిందని కెటిఆర్ విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కుల గణన, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసిందని గుర్తు చేశారు. 2019 స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్ గా సర్పంచ్ల రిజర్వేషన్లను టిఆర్‌ఎస్ ఖరారు చేయగా, ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందని తెలిపారు. బిఆర్‌ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కుల గణనను అడ్డుకుంది ఎవరు? రిజర్వేషన్లపై అడ్డంకులు సృష్టించింది ఎవరు? అన్న ప్రశ్నలకు బిఆర్‌ఎస్ సమాధానం చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా బిసి రిజర్వేషన్ల పెంపు కోసం పోరాటం చేస్తూనే, పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో వారికి 42 శాతం సీట్లు కేటాయించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం సీట్లు కేటాయింపుపై బిఆర్‌ఎస్ స్పష్టత ఇవ్వాలని సవాల్ విసిరారు.

బిసి ఓటర్లున్న తండాలో ఎస్‌టికి రిజర్వు

- తండాలో సర్పంచ్ ఎన్నికలపై అయోమయం
- ఎంపిడిఒకు గిరిజనుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శంకరాయపల్లి తండాలో ఓటర్లంతా బిసిలుంటే.. సర్పంచ్ పదవిని ఎస్‌టికి రిజర్వు చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీనిపై గ్రామస్తులు జడ్చర్ల ఎంపిడివొ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో శంకరాయపల్లి తండాను గ్రామపంచాయతీగా గుర్తించినప్పటికీ, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా, నోటీసు ఇవ్వకుండా ఎస్‌టి ఓటర్ల జాబితాను జడ్చర్ల మున్సిపాలిటీ 9వ వార్డుకు బదిలీ చేశారు. ప్రస్తుతం శంకరాయపల్లి తండాలో 8 వార్డులు, 65 మంది బిసి ఓటర్లు ఉన్నప్పటికీ, సర్పంచ్ పదవిని ఎస్టీకి రిజర్వు చేశారు. ఇది ఎన్నికల ప్రక్రియను క్లిష్టం చేస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన ఓటర్లను తిరిగి శంకరాయపల్లి తండా ఓటర్ల జాబితాలో చేర్చి, స్థానిక గిరిజనులకు పోటీ చేసే అవకాశం కల్పించాల్సిందిగా గ్రామస్తులు ఎంపిడిఒకు విజ్ఞప్తి చేశారు. గతంలో 65 మంది ఓటర్లతో ఎప్పుడూ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఈ అనిశ్చితిని తొలగిస్తూ, రిజర్వేషన్ సమస్యపై వెంటనే చర్యలు చేపట్టాలని గోపాల్ నాయక్, మరికొందరు తండావాసులు ఎంపిడిఒను కోరారు.

చింతలకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవం

- పంచాయతీ ఎన్నికల్లో కీలక పరిణామం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పంచాయతీ ఎన్నికల్లో కీలక పరిణామం చోటుచేసుకున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రెండ్రోజులకే ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట గ్రామ సర్పంచ్ ఎన్నిక పూర్తయింది. పోటీ లేకుండానే ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకోవటమే కాదు.. గెలుపు సంబరాలు కూడా చేసుకున్నారు. ఈ గ్రామంలో సుమారు 2500కి పైనే ఓటర్లు, 12 వార్డులున్నాయి. ఈ గ్రామాభివృద్ధి చేసి చూపిస్తానని కె రాజశేఖర్ ముందుకొచ్చారు. దాంతో రాజకీయ పార్టీల కతీతంగా రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా ఎన్నికైన ఆయనకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆ గ్రామం ఎన్నిక నిలిపివేయాలని హైకోర్టులో ఫిర్యాదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామ సర్పంచ్ స్థానం రిజర్వేషన్‌లో నిబంధనలను పాటించలేదని ఆ గ్రామానికి చెందిన మిట్టగడుపుల యాకోబ్, కాసోజు ఏకాంతచారి, సిలివేరు లింగయ్య, పోలు నాగయ్య, కాసోజు విజయకుమార్, బత్తుల వెంకటమల్లు అన్నారు. గ్రామంలో మహిమ పట్నం గ్రామపంచాయతీలో మొత్తం 576 ఓటర్లు ఉండగా ఇందులో 199 మంది ఎస్సీలు, 358 మంది బిసిలు, 13 మంది ఒసిలు, ఏడుగురు ఎస్‌టికి చెందిన ఓటర్లు ఉన్నారు. 2017లో తమ గ్రామ పంచాయతీ నుంచి తౌరియా తండా భూక్యారాం తండాలు నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయని, 2019లో మహమూద్ పట్నం సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించినట్టు తెలిపారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్లు తమ గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్‌టి జనరల్‌గా ప్రకటించారు. వాస్తవానికి గ్రామంలో ఎస్‌టి ఓటర్లు కేవలం రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరికి సర్పంచ్ పదవితో పాటు మూడు వార్డులను కూడా రిజర్వేషన్ చేసినట్టు తెలిపారు. వాస్తవానికి 2011లోని ఎస్టీ ఓటర్లను కలుపుకొని 1332 మంది ఓటర్లు ఉన్నట్టుగా భావిస్తూ తమ గ్రామానికి ఎస్‌టి రిజర్వ్ చేశారని ఆరోపించారు తమ గ్రామంలో ఎన్నికలను వెంటనే నిలిపివేయాలని, కులాల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించి రిజర్వేషన్ పునర్ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్‌పై తాము హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. ఎన్నికలు నిలిపివేయాలని తమ కోరుతున్నట్టు చెప్పారు.

ఎసిబి వలలో.. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్

- ఇంటి నెంబర్ కేటాయించడానికి రూ.20 వేలు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



జామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఎ.రాజు, డ్రైవర్ భూమేష్ గురువారం సాయంత్రం రూ.20,000 లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..

కొత్తగా నిర్మించిన భవనానికి గానూ ఇంటి నెంబర్ కేటాయించడానికి మున్సిపల్ కమిషనర్ రూ.20,000 డిమాండ్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు డ్రైవర్ బ్యాగును తనిఖీ చేయగా.. లంచం మొత్తానికి అదనంగా రూ.4,30,000 లెక్కల్లో లేని నగదును ఎసిబి అధికారులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి హైదరాబాద్ నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎసిబి డిఎస్‌పి తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్



ధర్నాలో మాట్లాడుతున్న బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్, మతోన్మాద శక్తులకు ఉపయోగపడేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే నల్ల చట్టాలను సంపూర్ణంగా రద్దు చేయాలని కోరుతూ గురువారం ఖమ్మంలోని సరిత క్లినిక్ సెంటర్‌లో లేబర్ కోడ్ జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో బి.వెంకట్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్, మతోన్మాద శక్తులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక, రైతు హక్కులతో పాటు ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. దాంతో కార్పొరేట్ శక్తులకు, గుత్తా పెట్టుబడుదారులకు ఉపయోగపడేలా దేశ సంపదను కట్టబెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12 గంటల పని గంటల పెంపు, కనీస వేతనాలు చట్టం రద్దు, ఫ్యాక్టరీ యజమానులకు సకల హక్కులు కల్పిస్తూ ప్రధాని మోడీ జీవోలు చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని సైతం రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

యుపిఎ -1 ప్రభుత్వం 2005లో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి నేడు క్రమక్రమంగా బడ్జెట్‌ను తగ్గిస్తున్నారని, ఎనిమిది కోట్ల మంది వ్యవసాయ కూలీలకు పని లేకుండా జాబ్ కార్డును రద్దు చేశారని తెలిపారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసేవరకూ పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణు, కల్యాణం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక, సిఐటియు, రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్, వల్లమూడి నాగేశ్వరరావు, వై విక్రం, పడిగల నాగేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్, భూక్య శ్రీనివాసరావు, గుండె వెంకట్రావు, బండారు వెంకయ్య, ముదాం శ్రీనివాసరావు, షేక్ బషీర్, ఎస్‌కె ఇమామ్, సారంగి పాపారావు, ఆర్ ప్రకాష్, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్ రెడ్డి, రంగు హనుమంత చారి, లోకేష్, జిల్లా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ల రాజేష్ హత్యకు చిలుకూరు ఎస్ఐ, ఇతర సిబ్బంది కారకులు

- వారిపై హత్యకేసు, ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు పెట్టాలి
- డిజి (ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్‌కు మంద కృష్ణ మాదిగ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితుడైన కర్ల రాజేష్ హత్యకు కారకులైన చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డి, కోదాడ రూరల్ పోలీసులపై హత్య కేసుతో పాటు, ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన డిజి (ఇంటిలిజెన్స్) విజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పోలీస్ స్టేషన్లలో బంధించి చిత్రహింసలు పెట్టినందు వల్లే రాజేష్ మరణించారని తెలిపారు. ఐదు రోజులపాటు కుటుంబ సభ్యులకు చూపించకుండా ఎందుకు బంధించారో తెలపాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, డిఎస్‌పి, చిలుకూరు ఎస్ఐ రెడ్డి సామాజిక వర్గానికే చెందిన వారనీ, ఆ ముగ్గురు ఘటనను కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చట్టపరమైన న్యాయం, సహాయం ఇవ్వకుండా రాజీ కుదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వినతిపై డిజి స్పందిస్తూ, ఘటనపై సమాచారం సేకరించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విత్తనాలను డీలర్లు అమ్మాల్సిందే

- తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు ప్రభుత్వ విత్తనాలను ప్రయివేటు డీలర్లు అమ్మాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విత్తన డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. 20 జిల్లాల నుంచి ప్రయివేటు విత్తన డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర సర్కారు ప్రయివేటు డీలర్లకు లైసెన్స్ ఇచ్చి సహకరిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రయివేట్ కంపెనీలు ఆకర్షణీయ ప్రకటనలతో, మోసపూరిత మాటలతో మార్కెట్లో విత్తనాలను అమ్ముతున్నాయని తెలిపారు. మార్కెట్‌లో ప్రయివేటు కంపెనీల అజమాయిషీతో రైతులకు నష్టం జరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలతో పంట నష్టం జరిగినప్పుడు రైతులను ఆదుకునేందుకు కంపెనీలు ముందుకు రాకపోవడాన్ని తప్పుబట్టారు.

అధిక రేట్లకు ప్రయివేటు కంపెనీలు విత్తనాలను అమ్మటం దుర్మార్గమన్నారు. అందుకే ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతుందనీ, రైతులకు నష్టం జరగకుండా మంచి విత్తనాలను అందించాల్సిన బాధ్యత ప్రయివేట్ డీలర్ల మీద ఉందని చెప్పారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ శక్తికి మించి ప్రయత్నించిందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రయత్నాలను బిజెపి అడ్డుకుందని విమర్శించారు. తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలతో పది వేల మంది సర్పంచ్‌లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాలను అభివృద్ధి చేయని బిఆర్‌ఎస్ పాలనలో సర్పంచ్‌లు ఆత్మహత్యలకు బలయ్యారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విధించిన నిబంధన గురించి తెలియకుండా బీసీ రిజర్వేషన్లపై కేటీఆర్ మాట్లాడటం అర్థరహితమని కొట్టిపారేశారు.

భూములు కోల్పోతున్న రైతులకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

- ఎమ్మెల్సీ కవిత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా భూములు కోల్పోతున్న రైతులకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా గురువారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్నా.. ఆ నీటితో నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో చెరువుల ద్వారా 22 వేల ఎకరాలు, కౌలాస్‌నాలా ద్వారా తొమ్మిది వేల ఎకరాలు మాత్రమే సాగవుతుందని ఇంకా 40 వేల ఎకరాలకు నీళ్ల అవసరమని తెలిపారు. లెండి ప్రాజెక్టు మహారాష్ట్రతో పంచాయితీ ఉండడం వల్ల ఏళ్ల తరబడి నిర్మాణం కాకుండా పోయిందని, జుక్కల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 40 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలంటే నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ కట్టాలన్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా.. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టు కోసం దాదాపు 200 ఎకరాల భూ సేకరణ అవసరమున్నందున కేవలం పంపుహౌస్ కోసం 12 ఎకరాలు మాత్రమే సేకరించారని చెప్పారు. ప్రాజెక్టు చుట్టుపక్కల చిన్న, సన్న కారు రైతులతో ఆమె మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం ఎకరం భూమికి ఎంతో కొట్లాడితే గాని రూ.17లక్షల నష్టపరిహారం చెల్లించారని, అప్పటినుంచి ఇప్పటివరకు అన్ని ధరలు పెరిగాయని.. రైతులకు ఎకరానికి 50 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఎకరం భూమికి ఎకరం భూమి ఇంకో దగ్గర ఇవ్వాలన్నారు. కలెక్టర్ పరిస్థితిని పరిశీలించాలని ప్రాజెక్ట్ పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముంపు రైతులను వెంటనే ఆదుకోవాలి

ముంపు రైతులను వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని బంజారా శివారులో ముంపునకు గురైన రైతులతో ఆమె సమావేశమై మాట్లాడారు. ప్రజల ఓట్లతో గెలిచి సమస్యలు గాలికి వదిలేశారని అన్నారు. ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాల్లో విరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని హామీనిచ్చి గాలికి వదిలేశారని, దాన్ని వెంటనే అమలుచేసి ఇన్సూరెన్స్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బతుకమ్మ ఎత్తితే దించేది లేదని, ప్రజా సమస్యలు లేవనెత్తి పరిష్కరించే వరకూ తగ్గేది లేదని అన్నారు. ప్రశ్నిస్తే గానీ సమస్య పరిష్కారం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షులు ఎదురుగట్ల సంపత్ గౌడ్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి భాజా లలిత, యూత్ అధ్యక్షులు చరణ్, తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా సిఎం రేవంత్‌రెడ్డి

- 9,300 ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర
- ముఖ్యమంత్రిగా పాలమూరుకు చేసింది శూన్యం : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిలా కాకుండా రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా పని చేస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు బిజెపి, కాంగ్రెస్ నాయకులు బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హిల్ట్ విధానం పేరుతో మరో భారీ కుంభకోణానికి తెరలేపిందని ఆరోపించారు. మొదట మూసీ భూములు, ఆ తర్వాత రీజినల్ రింగ్ రోడ్డు, హెచ్‌సియు భూములపై పడ్డ రేవంత్ దృష్టి ఇప్పుడు హైదరాబాద్‌లోని పారిశ్రామిక భూములను దోచుకోవడంపై పడిందని విమర్శించారు. ఆ భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారనీ, అపార్ట్‌మెంట్లు, విల్లాలు కట్టుకునేందుకు అతి తక్కువ ధరకే అనుమతులు ఇస్తూ రియల్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 9,300 ఎకరాల భూమిని ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ, ఐదారు వందల మంది కోసం రూ.ఐదు లక్షల కోట్ల రాష్ట్ర ప్రజల ఆస్తిని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సగం డబ్బులు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయని అన్నారు. ఎవరి అబ్బ సొత్తని ఈ భూములను ధారాదత్తం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మోసం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం 24 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. బిసిలను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నా పాలమూరుకు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పది శాతం పనులను కూడా పూర్తి చేయలేదన్నారు. రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతోపాటు, క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలను వేయబోతున్నామని కెటిఆర్ చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలు, అవినీతి, హామీల వైఫల్యంపై ప్రజల్లోకి వెళ్లేలా కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

మత్స్య పరిశ్రమకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- ముగిసిన టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర 4వ మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి 2025-26 బడ్జెట్లో రూ.ఐదు వేల కోట్లు కేటాయించి, పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టిఎంకెఎంకెఎస్) రాష్ట్ర నాలుగో మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంగా మూడ్రోజులపాటు జరిగిన సంఘం రాష్ట్ర నాలుగో మహాసభ గురువారం ముగిసింది. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా మహాసభ ఆమోదించింది. రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకుంది. జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నరసింహ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మహాసభ తీర్మానించిన అంశాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ వివరించారు. 22 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోగించిందని తెలిపారు. ప్రతి మత్స్య సొసైటీకీ రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోరెంకల నర్సింహ(రంగారెడ్డి), లెల్లెల బాలకృష్ణ (రాష్ట్ర సెంటర్) ఎన్నికయ్యారు. మరో 19మంది ఆఫీస్ బ్యారర్స్, 51 మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో నూతన కమిటీని రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

'ఆర్థిక చట్టం-2025'ను రద్దు చేయాలి

- నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుల డిమాండ్
- ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్స్ సవరణ హక్కును నీరుగార్చే ఆర్థిక చట్టం-2025ను రద్దు చేయాలని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ.. పెన్షనర్ల పెన్షన్ సవరణ హక్కును తిరస్కరించే లేదా నీరుగార్చే ఉద్దేశంతో ఆర్థిక చట్టం-2025లోని నిబంధనలు ఉన్నాయన్నారు. 8వ వేతన సవరణ కమిషన్‌కు సూచించిన నిబంధనల నుంచి అభ్యంతరకరమైన.. తప్పుదారి పట్టించే పదజాలాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ కమిషన్‌తో జరిగే వేతనం, పెన్షన్ సవరణకు సంబంధించిన అన్ని చర్చల్లో పెన్షనర్లను చేర్చాలని కోరారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, కోల్‌మైన్స్ పెన్షనర్ల పెన్షన్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. ఇపిఎస్ పెన్షనర్లకు కరువుభత్యంతో కూడిన కనీస పెన్షన్ నెలకు రూ.9000, కోల్‌మైన్ పెన్షనర్లకు రూ.15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాప్రా అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కోవిడ్ కాలంలో రద్దు చేసిన రైలు ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ విషయంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనలను యథాతథంగా అమలు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పెన్షనర్లందరి ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. వివిధ పథకాల పేరుతో ఇప్పటికే ఉన్న వైద్య సదుపాయాలను కుదించే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఈ సదస్సులో నాయకులు సోమయ్య, రామకృష్ణాచార్యులు, బి గాంధీ, ఎస్ఎన్ రెడ్డి, భార్గవాచారి, యుగేందర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 18న ఖమ్మంలో సిపిఐ శతవార్షికోత్సవ బహిరంగ సభ

- గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 26 సభ వాయిదా
- కాంగ్రెస్‌తో పరస్పర అవగాహన, సిపిఎంతో పరస్పర పోటీ నివారణ : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలో డిసెంబర్ 26న తలపెట్టిన సిపిఐ శతవార్షికోత్సవ బహిరంగ సభను గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జనవరి 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం సమావేశ వివరాలు తెలుపుతూ కూనంనేని ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ బహిరంగ సభకు దేశ నలుమూలల నుంచి ఐదు లక్షల మంది హాజరవుతారని తెలిపారు. ఆ మహాసభ జయప్రదం కోసం దేశవ్యాప్తంగా జాతాలు, వివిధ కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో రాష్ట్రంలో సాధ్యమైన మేరకు కాంగ్రెస్ పార్టీతో అవగాహన కుదుర్చుకుని పోటీచేయాలనీ, సిపిఐ-సిపిఎం మధ్య పరస్పర పోటీ లేకుండా చూసుకోవాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వీలైనన్ని ఎక్కువ సర్పంచి స్థానాలను గెలిచేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ విద్యార్థులపై మోపిన ఉపా చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు జరిపిన ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం ఉపా చట్టాన్ని మోపడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది హిడ్మా ఎన్ కౌంటర్‌ను వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాంటి వారందరిపైనా నల్ల చట్టాలను ప్రయోగిస్తారా? ఇలా ఎంత మందిని జైళ్లో పెడ్తారు? అని ప్రశ్నించారు. విద్యార్థులపై పెట్టిన ఉపా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కూనంనేని డిమాండ్ చేశారు.



గేటుపై నుంచి బాధితుడిని దించుతున్న ఫారెస్ట్ అధికారులు

మాభూమి మాకు ఇప్పించండి

- కలెక్టరేట్ గేటుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన యువ రైతు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తన భూమి ఇప్పించాలని ఓ యువరైతు వికారాబాద్ కలెక్టరేట్ గేటుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఘటన వికారాబాద్ జిల్లాలో సోమవారం జరిగింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం చిట్లపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాలు.. 70 ఏళ్ల నుంచి తొమ్మిది ఎకరాల 26 గుంటల భూమిని సాగు చేసుకుంటున్నారు. జీవనోపాధి కోసం ముంబాయికి రెండు కుటుంబాల రైతులు వెళ్లారు. వారు వెళ్లిన సందర్భంలో మూడు ఎకరాల 26 గుంటల భూమిని పారెస్ట్ భూమంటూ అధికారులు అక్రమించుకొని కంచె వేశారు. 70 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న పట్టా భూమి.. అటవీ భూమి ఎలా అవుతుందని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. వడ్డె చంద్రమ్మ వంతుకు వచ్చిన 24 గుంటల భూమి కోసం వడ్డె శ్రీనివాస్ ఎన్నో రోజుల నుంచి పోరాడుతున్నాడు. అధికారులు స్పందించకపోవడంతో గురువారం కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పి కిందకు దించారు. 'తిరిగి తిరిగి అలసిపోయాం తమకు చావడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు' అని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి, కలెక్టర్ స్పందించి పేదలమైన తమకు న్యాయం చేయాలని కోరాడు.



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుక

గుంటూరు : కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ కూడా తన అన్ని కార్యాలయాలు, శాఖలలో ఈ కార్యక్రమాలను చేపట్టింది. గుంటూరులోని హెడ్ ఆఫీసులో జరిగిన కార్యక్రమానికి ఒఎస్‌డి ఎం అరుణ్ కుమార్, విజిలెన్స్ ఇంచార్జ్ హరిష్ బేత, జనరల్ మేనేజర్లు, అలాగే వివిధ విభాగాల సిబ్బంది హాజరయ్యారు. ఉద్యోగులంతా రాజ్యాంగ పీటిక పఠనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత రాజ్యాంగం సమగ్రత, స్థిరత్వం, సౌలభ్యత, నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండడం, వంటి అనేక కీలక లక్షణాలను కలిగి ఉందని విజిలెన్స్ ఇంచార్జ్ హరిష్ బేత పేర్కొన్నారు.